సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



అలసత్వం వహిస్తే చర్యలు

జిల్లాలోని గృహ నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. - 8లో



గ్యాస్‌తోనే మధ్యాహ్న భోజనం


ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనాన్ని గ్యాస్‌తోనే వండాలని, కట్టెలతో వండరాదని డీఈఓ వరలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. - 8లో



మేమింతే!

నగరిలో డైయింగ్ యూనిట్ల యజమానులు దారుణంగా వ్యవహరిస్తున్నారు. రంగు నీళ్లను రోడ్లపై వదిలేస్తున్నారు. - 8లో

మెడికిల్స్




నిబంధనలు పాటించని మెడికల్ షాపులు

- ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలు
- ఫిజీషియన్ శాంపిళ్లు, కాలం చెల్లిన మందుల అమ్మకాలు
- షాపుల్లో బినామీల దందా
- కానరాని ఫార్మసిస్టు
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్న అమాయకులు



మీకు తల నొప్పి వస్తుందా?.. తరచూ జ్వరం బారినపడుతున్నారా?.. కడుపు, ఒళ్లు నొప్పులతో భరించ లేకపోతున్నారా?.. నిద్ర పట్టడం లేదా?.. మీకు భయమేమీ లేదు.. అనారోగ్య సమస్య గురించి చెబితే చాలు..



ప్రిస్క్రిప్షన్ లేకుండానే మెడికల్ షాపుల్లో అన్నిరకాల మందులు ఇచ్చేస్తారు. ఎంత మొత్తంలో కావాలన్నా విక్రయిస్తారు. ఏ మందు వేసుకోవాలో.. రోజుకు ఎన్ని వేసుకోవాలో.. ఎన్ని రోజులు వాడాలో కూడా వారే సూచిస్తారు. ఇలా జిల్లాలో మెడికల్ షాపుల నిర్వాహకులు అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారు. అధికారులు ఏదో ఓ సారి తనిఖీ చేయడం, నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది.

చిత్తూరు రూరల్ (కాణిపాకం): డ్రగ్స్, కాలపరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలు సైతం జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే, వాటికి బదులు వేరే కంపెనీ మందులు అంటగడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. 'సేమ్ ఫార్ములా.. కంపెనీ మాత్రమే వేరు.. ఇది కూడా దానిలాగే పని చేస్తుంది.. అని ఉచిత సలహాలు ఇస్తున్నారు. జిల్లాలో సుమారు 1,500 వరకు రిటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపులున్నాయి. అలాగే చాలామంది క్లినిక్‌లోనే మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకున్నారు. రోజూ ప్రతి చిన్న, పెద్ద దుకాణాల్లో రూ.5 వేల నుంచి రూ.లక్ష దాకా వ్యాపారం సాగుతోంది. ఈ వ్యాపారం ఇష్టానుసారంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

తారుమారు

డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్టు- 1940, ఫార్మసీ యాక్టు- 1948 ప్రకారంగా బీ ఫార్మసీ లేదా ఎం.ఫార్మసీ పూర్తిచేసిన వారే మెడికల్ షాపులు నిర్వహించాలి. షాపు పర్మిషన్ తీసుకునే సందర్భంలో సంబంధిత ఫార్మసిస్టుల సర్టిఫికెట్లతోపాటు వ్యక్తిగత గుర్తింపుకార్డు ప్రతులు, చిరునామా తదితర



మెడికల్‌షాపు తనిఖీలో అధికారులు (ఫైల్)

వివరాలు దరఖాస్తుతో జతచేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పించాలి. అనుమతి మంజూరైన తర్వాతే షాపులు నిర్వహించాలి. జిల్లాలో మెడికల్ షాపులు చాలామంది బినామీలే నిర్వహిస్తున్నారు. ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితోనే దుకాణాలను నిర్వహించాలి. చాలామంది తక్కువ వేతనంతో యువకులను పనిలో పెట్టుకుంటున్నారు. మెడికల్‌పై పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ఇదోరకమైన దందా..

జనరిక్, నాన్ జనరిక్ తేడా లేకుండా షాపుల నిర్వాహకులు ఔషధ కంపెనీలతో పర్సంటేజీలు మాట్లాడుకొని వైద్యులతో కుమ్మక్కై ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు చేసిన మందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వకుండా విక్రయాలు చేస్తున్నారు. యాంటీబయాటిక్ మందులను డాక్టర్ల సూచనల మేరకు ఇవ్వాలి. కానీ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఇస్తున్నట్లు సమాచారం. దీంతో అనవసరంగా యాంటీబయాటిక్ మందులు వాడిన వారు సైడ్ ఎఫెక్ట్‌తో కొత్తరోగాల బారిన పడుతున్నారు. ఇక బెంగళూరు నుంచి పలు రకాల బ్రాండ్‌ల పేరుతో అనధికారికంగా మందులు, మాత్రలు సరఫరా అవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇవీ తక్కువ రేటుకు ఇస్తుండడంతో మార్కెట్‌లో విచ్చలవిడిగా లభ్యమవుతున్నట్లు తెలుస్తోంది.

కలెక్టర్ ఆదేశాలతో రెండు నెలలకు క్రితం చిత్తూరు నగరంలోని పొన్నియమ్మ గుడివీధిలోని రెండు మెడికల్ షాపులపై డ్రగ్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో విక్రయానికి అనుమతి లేని మందులను గుర్తించారు. మందులు, మాత్రల విక్రయాలకు సంబంధించిన వివరాలు సక్రమంగా లేవని తెలుసుకున్నారు. దీంతో ఆ షాపును సీజ్ చేయగా..మరో షాపునకు నోటీసులు ఇచ్చారు. ఇది ఒక్కటే కాదు.. ఇలా వందల సంఖ్యలో మెడికల్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి.



న్యూస్‌రీల్

ఎంపీటీసీ ఉప ఎన్నికకు మూడు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతుదారురాలు హర్షిత

రామకుప్పం(కుప్పం): రామకుప్పం మండలం, మణీంద్రం ఎంపీటీసీ స్థానానికి జరనున్న ఉప ఎన్నికల్లో భాగంగా గురువారం మూడు నామినేషన్లు దాఖలైనట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు శాంతకుమారి ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. ఆమె అనారోగ్యంతో మృతి చెందటంతో మణీంద్ర ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ మేరకు గుర, శుక్రవారాల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందులో భా గంగా గురువారం వైఎస్సార్ సీపీ మద్ద తుదా రు, మండల వైఎస్సార్ సీపీ కో కన్వీనర్ కుమా ర్తె హర్షిత నామినేషన్ వేశారు. టీడీపీ మద్దతుదారు అరుణా, విశాలాక్షి నామినేషన్ వేసినట్టు ఎన్నికల అధికారి లక్ష్మీకాంత్ తెలిపారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి



గుర్తింపు పత్రాలను అందజేస్తున్న ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సమగ్రశిక్షశాఖ ఏపీసీ వెంకటరమణ సూచించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని గిరింపేట వద్ద ఉన్న సీఎంఎస్ఎస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న లీడర్ షిప్ ముగింపు కార్యక్రమానికి ఆయన అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు లీడర్‌షిప్ శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. పాఠశాలల నిర్వహణలో నైపుణ్యాలు ముఖ్యమన్నారు. నాయకత్వ లక్షణాలను మెరుగుపరుచుకుని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న టీచర్లకు గుర్తింపు పత్రాలను అందజేశారు. గుడిపాల ఎంఈవో 2 గణపతి, అసిస్టెంట్ ఏఎంఓ సుభాషిణి పాల్గొన్నారు.

సిజేరియన్లు తగ్గించాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో సిజేరియన్ల సంఖ్యను తగ్గించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భవతులపై దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భవతులను నమోదు చేయించాలన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలందేలా చూడాలన్నారు. హైరిస్క్ కేసులను గుర్తించాలన్నారు. సిజేరియన్లను తగ్గించాలన్నారు. టీనేజీ గర్భవతుల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. అబార్షన్లపై నిఘా పెట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. సమీక్షలో అధికారులు వెంకటప్రసాద్, అనిల్‌కుమార్, సుదర్శన్, ప్రవీణ, అనూషా, జార్జి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకంలో నిరుద్యోగ యువతికి ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్, బ్రాడ్‌బాండ్ టెక్నీషియన్, అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్ట్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్ ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వంద శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఎన్‌సీవీఈటీ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు సమీపంలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9959015657, 8686149492, 9866241270 నంబర్‌లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్థిక బకాయిలు చెల్లించండి



సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 5వ తేదీన చిత్తూరులో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సమస్యలతో పాటు వారికి రావాల్సిన ఆర్థిక బకాయిలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. మూడు నెలల కాలంలో వారానికి ఒక సమస్యను లేవనెత్తి ఉద్యోగుల పక్షాన పోరాడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు దాదాపు రూ.25 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. 12 రకాల ఉద్యోగుల సమస్యలను మూడు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నరేష్‌బాబు, కోశాధికారి దేవకుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బాలాజీరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చలపతిరెడ్డి, నాయకులు హరిప్రసాద్, మనోజ్, గౌరీశంకర్, మోహన్, దిలీప్ పాల్గొన్నారు.

రూ.లక్ష కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయ్ లోకేష్?

- మంత్రి లోకేష్ ఆరోపణలపై పుంగనూరు నేతల ఫైర్

పుంగనూరు: 'మీ తాత ఆస్తి గతంలో రెండెకరాలు.. ఇప్పుడు మీ నాన్న లక్షల కోట్లకు ఎలా చేరింది.?' అని పుంగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి లోకేష్‌ను ప్రశ్నించారు. అడ్డదారిలో డబ్బు సంపాదించే అలవాటు తమ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి లేదన్నారు. మీ తాత పేరుతో రెండెకరాల భూమి ఉన్నప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి పేరుతో ఎంత ఆస్తి ఉందో తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. పెద్దిరెడ్డి కాలేజీ రోజుల్లోనే స్కూటర్ మీద వచ్చేవారన్నారు. అప్పట్లో చంద్రబాబుకు కనీసం సైకిల్ కూడా ఉండేది కాదని గుర్తుచేశారు. ఇప్పుడు లక్షల కోట్లు ఎలా వచ్చాయో విచారణకు సిద్ధమా..? అని సవాల్ విసిరారు. లోకేష్ నిత్యం పెద్దిరెడ్డి కుటుంబంపై బురద జల్లుతున్నారని ఆరోపించారు. ఆదాన్ డిస్టలరీస్ నుంచి ఒక పైసా కూడా పీఎల్ఆర్ కంపెనీ తీసుకోలేదన్నారు. వ్యాపారాలు చేసేటప్పుడు ఒకరి నుంచి ఒకరు డబ్బు తీసుకోవడం .. ఇవ్వడం మామూలేనన్నారు. అదే క్రమంలో 2019లో రూ.5 కోట్లు తీసుకుని మళ్లీ ఆ డబ్బు తిరిగి 2021లో తిరిగి చెల్లించారని గుర్తుచేశారు. ఇందులో ఏం తప్పుందో చెప్పాలన్నారు. చంద్రబాబు, లోకేష్ కుటుంబాలు చేసే వ్యాపారాల్లో ఇలాంటి లావాదేవీలు ఏమీ లేవా..? అని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి కుటుంబం దశాబ్దాలుగా వ్యాపారాల్లో ఉందన్నారు. కష్టపడి సంపాదించిన డబ్బును పెద్దిరెడ్డి కొంత పేదలకు ఇవ్వడం అలవాటు చేసుకున్నారని చెప్పారు. ఆయన కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేయడం టీడీపీ నాయకులు మానుకోవాలని హితవు పలికారు.

గుట్కా మరకలంటుకున్న ఖాకీ ఎవరు?

- వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ఎస్పీ
- విచారణ అధికారిగా పలమనేరు డీఎస్పీ
- దారి దోపిడీ ముఠాపై ఆరా తీసున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: గుట్కా వ్యాపారి నుంచి మామూళ్లు తీసుకున్నారనే ఆరోపణలపై నిగ్గు తేలి్, వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆదేశాలు జారీచేశారు. చిత్తూరుకు చెందిన ఓ గుట్కా వ్యాపారి నుంచి ఓ ఖాకీ పెద్ద మొత్తంలో లంచం తీసుకున్నారనే ఆరోపణలు రెండు రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. గత నెల జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడం, పత్రికల్లో సైతం ప్రచురితమవడంతో ఘటనను ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. చిత్తూరుకు చెందిన ఓ గుట్కా వ్యాపారి వాహనం బెంగళూరు నుంచి చెన్నైకి పొగాకు ఉత్పత్తులు తీసుకెళ్తుండగా రాత్రి గస్తీలో ఉన్న ఓ పోలీసు అధికారి, సిబ్బంది వాహనాన్ని ఆపి నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎస్పీ స్పందించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించడానికి పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వారం రోజుల్లో ఈ ఘటనపై విచారణ పూర్తి చేసి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

హైజాక్ ముఠాపై ఆరా..

వాస్తవానికి గతంలో చిత్తూరు మీదుగా ఎర్రచందనం స్మగ్లింగ్ చేసేప్పుడు పోలీసులు తనిఖీలు చేయడం, నిందితులను పట్టుకోవడం.. కొన్ని సార్లు నిందితులు ఖాకీల కళ్లుగప్పి పారిపోవడం జరిగేది. ఇదే సమయంలో స్మగ్లర్లు తీసుకెళ్లే ఎర్రచందనాన్ని దారికాచి, హైజాక్ చేయడానికి ఓ రెండు ముఠాలు పనిచేసేవి. చిత్తూరు కేంద్రంగా పనిచేసే ఈ ముఠాలు సరిహద్దులు దాటేసమయంలో, పలు వాహనాల్లోని ఎర్రచందనాన్ని దారిదోపిడీ చేసి చేజిక్కించుకునేవాళ్లు. ప్రస్తుతం చిత్తూరు కేంద్రంగా సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులను అక్రమ మార్గాల్లో తరలిస్తున్న వ్యాపారులే లక్ష్యంగా ఓ హైజాక్ ముఠా పనిచేస్తున్నట్లు జోరుగా ప్రచారంలో ఉంది. పలువురు వ్యాపారుల నుంచి ఈ ముఠా సరుకును దోచుకున్నట్లు తెలుస్తోంది. అయితే సరుకును అక్రమ మార్గాల్లో తరలిస్తుండడంతో వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జరిగిన గుట్కా బండి ఘటనలో కూడా ఉత్తరాదికి చెందిన వ్యక్తి సరుకును దోచుకోవడానికి వచ్చిన హైజాక్ ముఠా పోలీసులను చూసి పారిపోవడం, ఆపై పోలీసులు వాహనాన్ని స్వాదీనం చేసుకుని చేతులు తడుపుకోవడం జరిగిపోయింది. దీనిపై ప్రత్యేక విభాగం అధికారులు దృష్టి సారించి, ఎస్పీకి జరిగిన పరిణామాలు వివరించినట్లు సమాచారం.

తెలిసిపోయిందా..?

గుట్కాబండి నుంచి మామూళ్లు తీసుకున్నారనే విషయం పోలీసుశాఖలో తీవ్ర దుమారం రేపింది. గతంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డ ముఠా నుంచి లంచం తీసుకున్న ఘటన మరువకమునుపే.. గుట్కాబండి ఘటన తెరపైకి రావడం పోలీసుశాఖను కలిచివేస్తోంది. తప్పు చేసిన అధికారి ఎవరో ఇప్పటికే ఓ స్పష్టత వచ్చినట్లు తెలిసింది. ఈ ఘటన జరిగిన సమయంలో రాత్రి గస్తీలో ఉన్న అధికారుల వివరాలు, ఓ హోంగార్డు, బంగారుపాళ్యంకు చెందిన ఇద్దరు పోలీసులను సైతం విచారించనున్నట్లు సమాచారం. పనిచేసే అధికారులుగా గుర్తింపు ఉన్న వాళ్లను చేరదీసి, మంచి పోస్టింగులు ఇస్తే.. ఇలా అవినీతి ఆరోపణల్లో ఇరుక్కోవడంపై పోలీసు 'బాసు' కూడా అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. గుట్కా మరకల విషయంలో ఎవరెవరు చిక్కుకుంటారో..? ఎవరు బలవుతారో..? ఎవరు బయటపడుతారో..? అంటూ ఖాకీలే సర్వత్రా చర్చించుకోవడం కొసమెరుపు.

ప్రతిష్టాత్మకంగా ఎన్‌సీడీ సర్వే

బంగారుపాళెం: నాల్గవ విడత ఎన్‌సీడీ 4.ఓ సర్వే(నాన్‌కమ్యూనికబుల్ డిసీజస్)ని మరింత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఐసీఎంఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకేష్, జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ కర్త డాక్టర్ పద్మాంజలిదేవి ఆదేశించారు. గురువారం బంగారుపాళెంలోని ప్రభుత్వాస్పత్రిని వారు సందర్శించారు. ఆస్పత్రి ఆవరణలోని ప్రసూతివార్డు, ల్యాబ్, ఫార్మసీ, ఫిజియోథెరపీ, ఎయిడ్స్ పరీక్ష, చికిత్స కేంద్రం, క్షయ నివారణ కేంద్రాలను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఎన్‌సీడీ వ్యాధులంటే ఒకరి నుంచి మరొక్కరికి సంక్రమించని జబ్బులని తెలిపారు. బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ, ఊపిరితిత్తుల జబ్బులు, క్యాన్సర్, లివర్, నరాల బలహీనత, కీళ్ల జబ్బులు, మానశిక వ్యాధులు వంటివి ఎన్‌సీడీ కిందకు వస్తాయన్నారు.



బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రిని సందర్శిస్తున్న లోకేష్, పద్మాంజలిదేవి

ఇప్పటి వరకు మూడు వితలు సర్వే చేశారని, ప్రభుత్వం మరింత నిర్మాణాత్మకంగా 4.ఓ తీసుకొచ్చిందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పటిష్టంగా సర్వే చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీషా, డాక్టర్లు శాలిని, విజయకుమారి, స్వరూప్‌నాయక్, చంద్రమోహన్, జశ్వంత్‌రాయల్ పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్ఓ శంకరన్ తెలిపారు. మొత్తం 1,339 చౌక దుకాణల పరిధిలోని 5.4 లక్షల కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, కంది పప్పు అందించనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం జిల్లాకు 8వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 3వేల మెట్రిక్ టన్నుల చక్కెర పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు.

శరవేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవ నిర్వహణకు సిద్ధమవుతోంది. ఈనెల 27న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లను ప్రారంభించారు. తొలుత ఆలయానికి రంగులద్దే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పెయింటింగ్ పనుల తర్వాత విద్యుద్దీపాలంకరణ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



రంగులు అద్దుతున్న కూలీలు

అవయవదానంపై అవగాహన అవసరం

చిత్తూరు కలెక్టరేట్ : అవయవదానం పట్ల విద్యార్థులకు అవగాహన అవసరమని అపోలో యూనివర్సిటీ ఫిజియోథెరపీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రమ్యకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గురువారం పీసీఆర్, పీవీకేఎస్ ప్రభుత్వ కళాశాలల్లో అంగ్‌దాన్–జీవదాన్ అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అవయవదానం అంటే కేవలం శరీర భాగాలను మాత్రమే ఇవ్వడం కాదన్నారు. ఒక మనిషి మృతి చెందిన తర్వాత కూడా, అతని అవయవాలు మరొకరికి జీవితం ఇస్తాయన్నారు. అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగం అధ్యాపకులు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ హృదయ స్పందన అర్ధంతరంగా ఆగిపోవచ్చు కానీ కాసింత ఆలోచన చేస్తే మరో మనిషి పంచన చేరి ఆ గుండే చేసే చప్పుడు వినవచ్చన్నారు. ప్రయాణం సగంలోనే ఆగిపోవచ్చు కానీ మిగిలిపోయిన ఆ ప్రయాణాన్ని అవయవదానంతో మరొకరి సాయంతో పూర్తి చేయొచ్చని పేర్కొన్నారు. ఒక మనిషి మృతి చెందినా మళ్లీ బతకవచ్చంటే అది కచ్చితంగా అవయవదానం వల్లే సాధ్యమవుతుందన్నారు. మృతి చెందిన అనంతరం కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, జీర్ణవ్యవస్థలోని ప్యాంక్రియాస్, పేగులు



పీసీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రమ్యకృష్ణ

దానం చేయవచ్చని తెలిపారు. బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ అయిన వారి నుంచి అవయవాలు సేకరిస్తారన్నారు. అవయవదానం చేయాలనుకునే వారు ముందుగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తమకు తెలిసిన వారందరికీ సమాచారం అందివ్వాలని తెలిపారు. అవయవదానం పై ఇప్పటికీ పలువురిలో అపోహలున్నాయన్నారు. ప్రచారం లేకపోవడంతో అవగాహన పెరగడం లేదన్నారు. అవగాహన పెంచేందుకు అపోలో యూనివర్సిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం అవయవదానం ఎలా చేయాలి ? ఎవరెవరికి సాధ్యం ? నిబంధనలు ఏమిటి ? అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డా.హసీనా, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

యంత్రాలతో వ్యవసాయం సులభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): యంత్ర పరికరాలతోనే వ్యవసాయ రంగాన్ని మరింత వృద్ధి చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. చిత్తూరు మండలం, తుమ్మింద గ్రామంలో గురువారం దక్షిత క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరిరక్షణ సంస్థ అనంతపురం వారి ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పరికరాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించి యంత్రాల ఎంపిక, మరమ్మతులు, వాటి ఉపయోగాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న వివిధ యాంత్రీకరణ పనిముట్ల మన్నికను పరీక్షించి వినియోగదారులకు నాణ్యమైన పరికరాలు అందేటట్లు చూస్తామన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, భాస్కర్, మండల వ్యవసాయశాఖ అధికారి వేణు పాల్గొన్నారు.



యంత్రపరికరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

క్లుప్తంగా

జిల్లా పోర్టు పోలియో జడ్జిగా జస్టిస్ కృష్ణమోహన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లా కోర్టు పోలియో (పరిపాలన) జడ్జిగా జస్టిస్ బీ.కృష్ణ మోహన్‌ను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టుకు రిజిస్ట్రార్ జనరల్ ఆదేశాలు జారీ చేశారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం

గుడిపాల: వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వ్యక్తులకు ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ చేయాలన్న ఆదేశాలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు ప్రతి నెలా 26 నుంచి 31వ తేదీ వరకు వారి ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా స్పష్టంగా ఆదేశిస్తూ ఇంటి వద్దకే రేషన్‌ను వంద శాతం అమలు చేయాలని, నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. కానీ డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారు. గుడిపాల మండలంలో 1,660 మందికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ ఇవ్వాల్సి ఉంది. కానీ గురువారం సాయంత్రానికి 820 మందికి మాత్రమే ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేసినట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఇందులో కూడా కొంతమంది డీలర్లు తమ ఇంటివద్దకే వచ్చి రేషన్ తీసుకోవాలని, తాము మాత్రం మీ వద్దకు రావడం కుదరదని తెగేసి చెప్పినట్లు సమాచారం.

ఇద్దరు ఎస్‌ఐలకు స్థాన చలనం

చిత్తూరు అర్బన్: పలమనేరు సబ్–డివిజన్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపంజాణిలో పనిచేస్తున్న ధనంజయను పలమనేరుకు, ఇక్కడున్న లోకేష్‌రెడ్డిని పెద్ద పంజాణికి బదిలీ చేశారు.

మేం ఇక్కడే ఉంటాం!

- మంత్రి సమీక్షలో బట్టబయలైన అధికారుల తీరు
- 2018లో కుప్పంకు హంద్రీ–నీవా డివిజన్–12 కేటాయింపు
- మదనపల్లె ఎస్ఈ కార్యాలయంలోనే డివిజన్ నిర్వహణ
- సీఎం చంద్రబాబుకే మస్కా
- రూ.169 కోట్ల పనులున్నా మదనపల్లె నుంచే పర్యవేక్షణ
- అధికారులు హెడ్‌క్వార్టర్ కుప్పంలో నివాసం లేరని మంత్రే నిర్ధారణ



మదనపల్లె ఎస్ఈ కార్యాలయంలోని కుప్పం డివిజన్ కార్యాలయం

మదనపల్లె: సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నుంచి పనిచేయాల్సిన హంద్రీ–నీవా ప్రాజెక్టు అధికారులు కుప్పానికి వెళ్లకుండా మదనపల్లెను వదలకుండా ఉండిపోతున్నారు. కుప్పంలో రూ.కోట్ల పనులు జరుగుతున్నా మేం ఇక్కడే ఉంటాం.. ఇక్కడి నుంచే పర్యవేక్షి స్తామన్నట్లుగా అధికారుల ధోరణి వ్యక్త మవుతోంది. సాధారణంగా ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘించే సాహసం ఏ అధికారీ చేయడు. అయితే హంద్రీ–నీవా ప్రాజెక్టు అధికారులకు మాత్రం ఆ సాహసం ఉందని చెప్పాలి. 2018లో సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంకు హంద్రీ–నీవా డివిజన్–12 మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అంతా కుప్పానికి తరలి పోయి అక్కడి నుంచే పాలన సాగించాలి. అయితే ఈ ఉత్తర్వు కేవలం కాగితానికే పరిమితమయ్యాయి. ఈ ఉత్తర్వు సమయంలో కుప్పం ఉపకాలువ పనులు సాగుతున్నాయి. వీటి పర్యవేక్షణ సులువుగా, అధికారులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే సీఎం నియోజకవర్గమైతే మాకేంటి అనుకున్నారేమో కుప్పంలో డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయకుండా, మదనపల్లె నుంచే విధులు నిర్వహిస్తున్నారు.

అంతా మదనపల్లె నుంచే

మదనపల్లెలో ప్రాజెక్టు సర్కిల్–3 కార్యాలయం ఉంది. ఇక్కడి నుంచి కుప్పంకు 120 కిలోమీటర్ల దూరం ఉంది. ప్రస్తుతం రూ.169 కోట్లతో రెండు రీచ్‌లతో కాంక్రీట్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. కుప్పం కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేసుంటే ఇక్కడి నుంచి పర్యవేక్షణ పక్కగా జరిగేది. ప్రస్తుతం మదనపల్లె ఎస్ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసుకున్న కుప్పం డివిజన్ కార్యాలయం నుంచి అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తుండడంతో రోజూ కుప్పం కాలువ పనుల పర్యవేక్షణ సాగించాల్సి వస్తోంది. బుధవారం ఈఈ వెంకటేశ్వర్లు కార్యాలయం ఉండి ఇక్కడి నుంచే విధులు నిర్వహించారు. ఇంతవరకు కుప్పంలో డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయకపోవడం, కనీసం అక్కడి నుంచైనా విధులు నిర్వహించకపోవడంతో కుప్పం లైనింగ్ పనుల పర్యవేక్షణ గాలికి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి.

ఈఈకి మూడు చార్జ్ మెమోలు

కుప్పం లైనింగ్ పనుల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లుకు ఏకంగా మూడు చార్జ్ మెమోలను జారీ చేయాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించడం హంద్రీ–నీవా ప్రాజెక్టు వర్గాల్లో కలకలం రేగాలి. అయితే దీనిపై అధికారులు టేకిట్‌ఈజీ అన్న ధోరణిలో కనిపిస్తున్నారు. సాక్షాత్తు మంత్రి చేసిన వ్యాఖ్యలపై కనీస స్పందనం లేదు. మంగళవారం మంత్రి ప్రాజెక్టు ఉపకాలువల పనులపై జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. కుప్పం కాలువ పనులకు సంబంధించి ఈఈ మీటింగ్‌కు హాజరుకాలేదు. దీనికి తోడు హెడ్‌క్వార్టర్ కుప్పం లేరని నిర్ధారించి చర్యలకు ఉపక్రమించారు. ఈ చార్జ్‌మెమోలను తిరుపతి చీఫ్ ఇంజినీర్ జారీ చేస్తారని ఎస్ఈ విఠల్‌ప్రసాద్ బుధవారం సాక్షికి చెప్పారు.

తదుపరి చర్యలేమిటి?

మంత్రి మదనపల్లెలో జరుగుతున్న కుప్పం డివిజన్ కార్యకలాపాలపై దృష్టి పెడతారా లేదా అన్నది తేలాలి. ఈఈ హెడ్‌క్వార్టర్‌లో నివాసం లేరని తేలగా ఇప్పుడు అక్కడ డివిజన్ కార్యాలయమే ఏర్పాటు చేయని అంశంపై ఎలా స్పందించాలి, ఎవరిపై చర్యలు తీసుకోవాలి. ఏడేళ్లకుపైగా కార్యాలయం ఏర్పాటు చేయకుండా అధికారులు ఎలా విధులు నిర్వహించారో తేల్చాలి. ఈఈపై చర్యలకు ఉపక్రమించిన మంత్రి ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా ధిక్కరించి మదనపల్లె ఎస్ఈ కార్యాలయంలో డివిజన్ కార్యాలయం నిర్వహణపై ఎవరిని బాధ్యులను చేస్తారు, ఎవరిపై చర్యలు తీసుకుంటారో తేలాలి.

గ్యాస్‌తోనే మధ్యాహ్న భోజనం

తవణంపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో తప్పని సరిగా గ్యాస్‌తోనే వంటలు చేసి పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి మధ్యాహ్న భోజన నిర్వాహకులను, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని తొడతర హైస్కూల్, తొడతర మోడల్ స్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొడతర హైస్కూల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి, ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికర భోజనాలు పెట్టాలన్నారు. కట్టెలతో వంటలు చేయరాదన్నారు. అనంతరం తొడతర ప్రాథమిక మోడల్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని సూచించారు. డీఈఓతో పాటు ఎంఈఓలు హేమలత, మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



తొడతర హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ వరలక్ష్మి

జరుగుతున్న పనులకు టెండర్లు!

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు కాస్త ఆలస్యంగా మేల్కొన్నారు. నగరంలో పలుచోట్ల రోడ్లు, ఇతర సివిల్ పనులకు టెండర్లు పిలవకుండానే పనులు అప్పగించడంపై 'సాక్షి'లో రెండు రోజుల క్రితం 'టెండర్ లేకుండా పనులా..?' శీర్షికన కథనం ప్రచురితమైంది. చేయి కాలాక ఆకులు పట్టుకున్నట్లు.. కలెక్టర్ బంగ్లాలో ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తయిన ప్రహరీ గోడ నిర్మాణానికి గురువారం రూ.39 లక్షల అంచనాలతో టెండర్లు పిలిచారు. కార్పొరేషన్ సాధారణ పద్దుల నుంచి పనులు చేయడానికి పిలిచిన టెండర్‌కు ఆగస్టు 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. మరో రెండు రోజుల్లో ప్రహరీ గోడ పూర్తవుతున్న నేపథ్యంలో అధికారులు చేస్తున్న పనులు చూసి జనం నవ్వుకునే పరిస్థితి నెలకొంది. ఇక ఆర్టీసీ బస్టాండులో టెండరు పిలవకుండానే పుట్‌పాత్ పనులు చేయడంపై.. స్థానిక ఎమ్మెల్యే కార్పొరేషన్ అధికారులను మందలించినట్లు తెలిసింది. దీంతో పుట్‌పాత్ నిర్మాణం కోసం ఉంచిన ఇనుప కమ్మీలను పక్కకు తీసేసిన అధికారులు, అక్కడ ఎవరూ పనులు చేయకుండా రిబ్బన్ ఏర్పాటు చేశారు.



చిత్తూరు ఆర్టీసీ బస్టాండు వద్ద కమ్మీలను పక్కకు తొలగించి.. రిబ్బన్లు కట్టిన అధికారులు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కాళ్ల నొప్పులు భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చిత్తూరు నగరంలోని నరిగపల్లి ప్రాంతంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జున వివరాల మేరకు.. నరిగపల్లి యానాది కాలనీకి చెందిన రాజు (44) కొన్నాళ్లుగా తీవ్రమైన కాళ్ల నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నొప్పులు భరించలేక గత నెల 27వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతుడు కోండల్‌గౌడ్

శ్రీరంగరాజపురం : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండంలోని అంకనపల్లి చెరువు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం, సింగంపల్లి గ్రామానికి చెందిన జగ్గయ్య కుమారుడు కోండల్‌గౌడ్ (35) పాలసముద్రం మండలంలోని ఓ పాల డెయిరీలో రీజనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా మండలంలో పాల సేకరణ కోసం వచ్చాడు. ఏమైందో ఏమోగానీ బుధవారం రాత్రి అంకనపల్లి చెరువు వద్ద ఉన్న బావిలో పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. మృతుడు కోండల్‌గౌడ్‌గా గుర్తించారు. చిత్తూరు ఫైర్ సిబ్బంది సహకారంతో బావిలో ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోట చెరువులో మహిళ మృతదేహం



మహిళ మృత దేహాన్ని పరిశీలిస్తున్న సీఐ హనుమంతప్ప

కార్వేటినగరం: కోట చెరువులో మహిళా మృతదేహం కలకలం రేపింది. సీఐ హనుమంతప్ప ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయం, నగర వీధుల్లో మతిస్థిమితం లేకుండా తిరుగాడుతున్న మహిళగా గుర్తించామన్నారు. మల విసర్జన కోసం చెరువు వద్దకు వచ్చి కాలుజారి పడి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె కోసం ఎవరైనా వచ్చినట్లయితే వారికి అప్పగిస్తామని, లేనిపక్షంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్మికుల చేత దహన క్రియలు నిర్వహిస్తామన్నారు. సీఐ వెంట ఏఎస్‌ఐలు మునికృష్ణ, ఏలుమలైరెడ్డి, సిబ్బంది రాజా, మురళీకృష్ణరాజు ఉన్నారు.

నేడు జిల్లాకు మంత్రి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖా మంత్రి జనార్దన్ రెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి శుక్రవారం పలమనేరులో నిర్వహించే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదే విధంగా అక్కడే నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 4 గంటలకు తిరుపతికి వెళ్తారని కలెక్టర్ వెల్లడించారు.

పురోగతిలో అలసత్వం వహిస్తే చర్యలు



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణాల పురోగతిలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖలతో వరుస సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాల్లో వారాంతపు లక్ష్యాలను కచ్చితంగా చేరుకోవాలన్నారు. హౌసింగ్ కాలనీల్లో అన్ని మెరుగైన వసతులు కల్పించాలన్నారు. గృహ నిర్మాణాల్లో ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు సాయం పై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. జిల్లాలో 2,11,628 మంది రైతులు అర్హులుండగా, ఇప్పటి వరకు 2,04,971 మందికి ఈకేవైసీ పూర్తి చేశారన్నారు. 6,644 మందిని తిరస్కరించడం జరిగిందన్నారు. అర్హత పొందిన ప్రతి రైతుకూ సంవత్సరానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం ఇస్తారన్నారు. ఇందులో కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా మరో రూ.14 వేలు ఉంటుందన్నారు. మొదటి విడతలో రాష్ట్రం వాటా రూ.5 వేలు, కేంద్రం వాటా రూ.2 వేలు చొప్పున ఈ నెల 2వ తేదీన మంజూరు చేస్తారన్నారు. అర్హుల జాబితా రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ, హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

104 డీఎంపై కక్ష సాధింపులా?



102 డ్రైవర్ హేమంత్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బీఎస్ఆర్‌పేట ప్రాంతంలో ఉన్న హోటల్‌కు, 104 డీఎం ప్రతాప్‌కు ఎలాంటి సంబంధం లేదని 102 (తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్) డ్రైవర్ హేమంత్ పేర్కొన్నారు. చిత్తూరులోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం 102 డ్రైవర్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాను 102లో డ్రైవర్‌గా పనిచేస్తూ..చిత్తూరు మండలం బీఎస్ఆర్‌పేట ప్రాంతంలో చిన్న హోటల్ నడిపిస్తున్నానన్నారు. చిత్తూరు నగరం కట్టమంచికి చెందిన ప్రేమ అనే మహిళ నుంచి ఈ హోటల్‌ను వంట సామాన్లతో సహా కొనుగోలు చేశానన్నారు. ఈ షాపు కొనుగోలు చేసి కేవలం ఐదు నెలలు అయ్యిందని, చేతిలో ఉన్న డబ్బులు మొత్తం హోటల్ కొనుగోలు, నిర్వహణకు పెట్టేశానన్నారు. దీని కారణంగా హోటల్‌లో ఎలాంటి మార్పులు చేపట్టలేకపోయానన్నారు. గతవారం తనపై వచ్చిన ఫిర్యాదుపై విచారించి అధికారులు విధుల నుంచి తొలగించారన్నారు. ఈ హోటల్ నిర్వహణలో 104 డీఎంకు కూడా సంబంధాలున్నాయని పలువురు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. డీఎంకు.. ఈ హోటల్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ హోటల్‌కు వేసిన రంగులు, ఫోన్ నెంబరు మారలేదని కొందరు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆయన వివరించారు.

న్యాయం చేయకపోతే ఉద్యమమే



నరోత్తమరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఏకీకృత సర్వీసు రూల్స్ విషయంలో న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరోత్తమరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఒకే డీఎస్సీ, ఒకే విధమైన ఉద్యోగం, ఒకే రకమైన జీతం అన్నింటా ఒకటే కానీ ఉద్యోగోన్నతుల్లో ఎందుకు వ్యత్యాసమని ప్రశ్నించారు. ఎప్పుడో బ్రిటీష్‌ల కాలంలో రూపొందించిన ప్రభుత్వ జీవోలను నేడు అమలు చేయడం హాస్యాస్పదమన్నారు. మొట్టమొదట ఏర్పాటు చేసిన పాఠశాలలు అన్ని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఏర్పాటు చేయలేదన్నారు. లోకల్ బాడీల పేరుతో ప్రపంచ బ్యాంకు షరతులతో ఒప్పందాలకు అనుకూలంగా జిల్లా పరిషత్, మున్సిపల్, రెసిడెన్షియల్, మోడల్ పాఠశాలల పేరుతో అనేక రకాలుగా పాఠశాలలు నెలకొల్పారని తెలిపారు. 1994 నుంచి ఒకే రకమైన డీఎస్సీ నిర్వహిస్తున్నారన్నారు. ఆ డీఎస్సీలలో ఎంపికయ్యే వారిని స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలను నియమిస్తున్నారన్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను రాష్ట్రపతి ఆర్డినెన్స్ తెచ్చే వరకు తీసుకెళ్లి, పార్లమెంట్‌లో చట్టం చేయకుండా వదలడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఇప్పుడు ఒకే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉండడం వల్ల ఏకీకృత సర్వీస్ నిబంధనలను పార్లమెంట్‌లో చట్టం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. స్కూల్ అసిస్టెంట్‌ల ఓట్లతో గెలుపొందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఈ విషయంలో చొరవ చూపాలన్నారు. స్కూల్ అసిస్టెంట్‌ల ఏకీకృత సర్వీస్ నిబంధనలతో హెచ్‌ఎంలు, డైట్, ఎంఈవోలు, హైస్కూల్ ప్లస్, జూనియర్ కళాశాలల లెక్చరర్ల ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధపడుతామని ఆయన హెచ్చరించారు.

మేమింతే!

- రసాయనాలను యథేచ్ఛగా రోడ్డుపైనే వదిలేస్తున్న డైయింగ్ యూనిట్ల యజమానులు
- పట్టించుకోని అధికారులు



కొత్తపేట భజన గుడి వీధిలో రోడ్డుపై పారిన రసాయన నీరు, నీటిని చూపుతున్న సీపీఐ నాయకులు

నగరి : మీరేమైనా చేసుకోండి..! అధికారులుగా మీ పని మీది.. మా పని మాది.. మేమింతే మారం అంతే..! అంటున్నారు కొందరు డైయింగ్ యూనిట్లు నడుపుతున్న యజమానులు. రసాయనాలను యథేచ్ఛగా రోడ్డుపైనే వదిలేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ యూనిట్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు, జిల్లా యంత్రాంగం పట్టీపట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

ఏళ్ల తరబడి ఇవే సమస్యలు

గురువారం కొత్తపేట భజన గుడి వీధిలోని రోడ్డుపైనే రసాయన నీరు ప్రవహించింది. నిబంధనలు పాటించని డైయింగ్ యూనిట్ల నియంతృత్వ పోకడకు నిదర్శనంగా నిలిచింది. వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేని అధికారుల అసమర్థతకు అద్దంపట్టింది. ఏళ్ల తరబడి భరిస్తూ వస్తున్నాం ఇంకా ఎన్నాళ్లు భరించాలంటూ స్థానికులు ప్రశ్నించడం కనిపించింది. డైయింగ్ యూనిట్లను ఊరికి దూరంగా పంపేస్తాం.. అందుకు అనువైన భూమిని సేకరిస్తున్నాం.. అంటూ ఉన్నతాధికారులు చెప్పే మాటలు కాగితాలకే పరిమితమవడం విమర్శలకు తావిస్తోంది.

రంగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

'నగరిలో రంగునీటి సమస్యకు మోక్షం ఎప్పుడు?.. స్వచ్ఛనగరి కావాలన్న ప్రజల ఆకాంక్ష తీరేదెప్పుడు?'.. అని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ పార్టీ కార్యదర్శి వేలన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుడివీధిలో పారుతున్న రసాయనాలను పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ అధికారులు ఎవ్వరూ దీనికి శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. సయానికి తగినట్లు నామమాత్రపు పరిష్కారం చూపుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, డైయింగ్ యూనిట్లపై ఆధారపడి జీవిస్తున్న కార్మిక కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని జనావాసానికి దూరంగా తరలించడానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో సమస్యను పరిష్కరించకుంటే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. వారి వెంట పార్టీ నాయకులు బాషా, విజయకుమార్ ఉన్నారు.

బకాయిలు చెల్లించాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలి
- ఆగస్టు 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- పిలుపునిచ్చిన ఫ్యాప్టో నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మణిగండన్, సెక్రటరీ జనరల్ మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు గురువారం జిల్లా ఎన్జీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో పనిచేసే టీచర్లకు బోధనేతర పనుల నుంచి మినహాయించాలన్నారు. టీచర్లను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. బోధనను హరించే యాప్‌ల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఫ్యాప్టో కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి టీచర్లు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగంలోని సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. పీ–4 కార్యక్రమం పేరుతో ఉపాధ్యాయులను నిర్బంధం చేయడం సరికాదన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ మాట్లాడుతూ నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించాలని డిమాండ్ చేశారు. 72, 73, 74 జీవోలను వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ టీచర్లను బోధనకు తప్ప ఏ ఇతర కార్యక్రమాలకు వినియోగించకూడదన్నారు. హైస్కూల్ ప్లస్‌లలో వెంటనే టీచర్ల నియామకాలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ పూల్‌తో వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. ఎంఈవో–1 పోస్టులను ఉమ్మడి సీనియారిటీ విధానంలోనే భర్తీ చేయాలన్నారు. ఏపీటీఎఫ్, సీపీఎస్ అసోషియేషన్ నాయకులు సమీర్ మాట్లాడుతూ 12 వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్ల పై ఆ సంఘ నాయకులు చర్చించి నిరసన చేపట్టారు. ఫ్యాప్టో సంఘ నాయకులు అరుణ్‌కుమార్, ముక్తార్ అహ్మద్, రామచంద్రయ్య, శేఖర్, రంగనాథం, గణపతి పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధికి కృషి



స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు తాండవమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం ఆ సొసైటీ సభ్యులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీని కలిసి ప్రణాళిక అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉన్న చిత్తూరు జిల్లాకు ఏళ్ల సంవత్సరాల ఘన చరిత్ర ఉందన్నారు. చిత్తూరును టూరిజం కారిడార్‌గా తీర్చిదిద్దాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరుకు సమీపంలో ఉన్న ఎన్టీఆర్ జలాశయం వద్ద త్రివేణి సంగమం, పుష్కర ఘాట్, అష్టదేవాలయాల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపడుతామన్నారు. కలవగుంట వద్ద 108 అడుగుల శివుని విగ్రహం, త్రివేణి సంగమం, పుష్కర ఘాట్లను నిర్మిస్తామన్నారు. చిత్తూరులోని నాలుగు ప్రధాన కూడళ్ల వద్ద నెమలి, గరుడ, నంది విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. సొసైటీ సభ్యులు చంద్రబాబు, శివకుమార్, అశోక్ పాల్గొన్నారు.